## క్లుప్తంగా

### భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు



గాడుబావి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: పట్టణంలోని బైటిపేటలో వెలసిన గాడుబావి ఆంజనేయస్వామి, గౌరిపేట ఆంజనేయస్వామి, పలక చింతమాను, కనుమ ఆంజనేయస్వామి ఆలయంలో భాద్రపద మాస అమవాస్య పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, సింధూర అర్చన, ఆకుపూజ, మహామంగళహారతి నిర్వహించారు. బనగానపల్లె రహదారిలోని పుట్టపెద్దమ్మ ఆలయంలో నిర్వాహకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో పూజలు చేశారు. సిమెంట్ నగర్‌లో సుంకులా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది.

### రూ.3.26 లక్షల నష్టపరిహారం అందజేత



చెక్కును అందజేస్తున్న పశువైద్యుడు

అవుకు: మండల పరిధిలోని సంగపట్నం గ్రామంలో గొర్రెల పెంపకందారులకు రూ.3.26 లక్షల నష్ట పరిహారాన్ని ఇన్‌చార్జ్ పశువైద్యుడు బ్రహ్మానందరెడ్డి బుధవారం అందజేశారు. గ్రామానికి చెందిన గుడిసె వెంకటేశ్వర్లు, శివమ్మలకు చెందిన 33 జీవాలు ఈ ఏడాది ఆగస్టు 19వ తేదీ పిడుగుపాటుకు గురై మృతిచెందాయి.ఈ మేరకు ప్రభుత్వం వారికి నష్టపరిహారం మంజూరు చేసింది. ఎల్ఎస్ఏ రాజేష్, ఏహెచ్ఏ మాల కొండయ్య, ఉగ్రసేనారెడ్డి పాల్గొన్నారు.

### మానవసేవే మాధవసేవ



అల్పాహారం వడ్డిస్తున్న కమిటీ సభ్యులు

డోన్ టౌన్: మానవసేవే మాధవసేవ అన్న గాంధీజీ ఆశయాల కోసం ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఎస్కేపీ హైస్కూల్ కమిటీ అధ్యక్షుడు బచ్చు జయశీలగుప్త అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాతబస్టాండ్‌లో పేదలకు అల్పాహారం అందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాజా సుధాకర్‌గుప్త, మాకంబాలు, బైసాని రాజు, జొన్నలగడ్డ సాయినాథ్, మాకం చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### రామాపురంలో రక్తదాన శిబిరం



రక్తదాతకు ప్రశంసా పత్రం అందిస్తున్న సభ్యులు

అవుకు: మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా అవుకు మండలం రామాపురం గ్రామంలో ఫ్రెండ్స్ బ్లడ్ గ్రూప్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రామాపురం, చెర్లోపల్లె గ్రామాల్లో ఎక్కువగా గని కార్మికులు ఉన్నారని.. పనులు చేసే సమయాల్లో ప్రమాదాలు జరిగి అవసరమైన బ్లడ్ గ్రూప్ రక్తం లభించక మృతి చెందిన ఘటనలు ఎన్నో ఉన్నాయని సంఘం ప్రతినిధి షాషావలి తెలిపారు. గ్రామంలోని యువకుల సహకారంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామంలో 31 మంది రక్తదానం చేశారని, వారికి ప్రశంసా పత్రాలు అందించామన్నారు. కార్యక్రమంలో కంబగిరిస్వామి, రాగిమాన్ బాబా, ఫక్రుద్దీన్, కైప రాజు, బాల దస్తగిరి, నాగేంద్ర, సురేష్ పాల్గొన్నారు.

### అవార్డు గ్రహీతలకు సన్మానం

బనగానపల్లె: స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు ఎల్ల సుబ్బయ్య, రఫీ, హరినాథ్‌గౌడ్‌లను బుధవారం సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షులు మాధవస్వామి, సంఘం నాయకులు మధుసూదన్‌రావు, సుబ్బరాయుడు, పోలియా నాయక్, రమేష్, రామస్వామి, కుమార్‌బాబు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌కు అవార్డు

బేతంచెర్ల: గోరుమానుకొండ ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మరియదానుకు స్వచ్ఛతాహీ సేవా జిల్లా స్థాయి అవార్డు లభించింది. పాఠశాలలో స్వచ్ఛతా కార్యక్రమాలు, పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకోవడంతో కలెక్టర్ రాజకుమారి, మంత్రి ఫారుఖ్ చేతుల మీదుగా బుధవారం అవార్డు అందుకున్నారు. ఆయన్ను ఉపాధ్యాయులు అభినందించారు.



డోన్: ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నాయకులు



డోన్: ఆపోపా నాయకులు



బేతంచెర్ల ఎంపీడీఓ కార్యాలయంలో..



బేతంచెర్ల: నగర పంచాయతీ కార్యాలయంలో..



బనగానపల్లె: మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

# బాపూజీకి ఘన నివాళి

- వాడవాడలా ఘనంగా గాంధీ జయంతి వేడుకలు
- నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

డోన్ టౌన్: మహాత్మాగాంధీ జయంతిని బుధవారం వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థి, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డోన్ పాత బస్టాండ్‌లో గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన పోరాట స్ఫూర్తి, త్యాగాలను వివరిస్తూ ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ అహింసా మార్గంలో నడవాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆపోపా అధ్యక్ష, కార్యదర్శులు మాకం రంజిత్‌కుమార్, జొన్నలగడ్డ శ్రీనివాసులు, సామాజిక కార్యకర్త మమ్మద్‌రఫీ, యూటీఎఫ్ నాయకులు వెంకటసుబ్బారెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యం శెట్టి, రాజకీయ పార్టీ నాయకులు ర్యాలీగా వచ్చి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు.

డోన్: దేశ స్వాతంత్య్రం కోసం తమ సర్వస్వం త్యాగం చేసిన మహనీయులను స్మరించుకోవడం పౌరులుగా మన బాధ్యత అని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి భానుసింగ్ అన్నారు. మహాత్మగాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా స్థానిక పెన్షనర్ల కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సంఘం కార్యదర్శి గాలయ్య, కోశాధికారి గోపాల్, నాయకులు రాందాస్‌రెడ్డి, మౌలాలి, హుసేన్‌సాహెబ్, పద్మావతమ్మ, నరసింహులు, సుబ్బరాయుడు, దాసప్ప పాల్గొన్నారు.

బనగానపల్లె రూరల్: జాతిపిత మహాత్మాగాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బనగానపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గాథంశెట్టి వేణుగోపాల్, సెక్రటరీ శ్రీరామవెంకటసుబ్బయ్య అన్నారు. స్థానిక ఆర్యవైశ్య భవనంలో జయంతిని నిర్వహించారు. పట్టణంలోని ఆస్థానం, పెట్రోల్ బంకు మీదుగా బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి గాంధీజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు శ్రీనయ్య, జంగం శెట్టి, వెంకటసుబ్బయ్య, జక్కా నాగరాజు, సురేష్ పాల్గొన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఈఓ హరిప్రసాద్, సర్పంచ్ ఎల్లయ్య పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. స్థానిక పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముకుందరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ఇక్బాల్, బాలమద్దిలేటి పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: స్థానిక అమ్మవారిశాల ఆవరణలో ఉన్న జాతిపిత విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడు రామసుబ్బారెడ్డి, తహసీల్దార్ కార్యాలయంలో పవన్‌కుమార్‌రెడ్డి, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సయ్యదున్నీసా నివాళులర్పించారు. గాంధీజీ అహింసా మార్గాన్ని ఎంచుకుని దేశానికి స్వాతంత్య్రం సిద్ధింపచేశారన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సంఘం నాయకులు గంగాధర్, శివనాగయ్య, అభిలాష్, నాగరాజు, శిల్పా సుబ్రమణ్యం, చంద్రశేఖర్, రిటైర్డ్ ఎస్ఐ బాలాజీ సింగ్, వెంకటేశ్వరరెడ్డి, చిట్టి వెంకటేశ్వర్లు, ఆర్ఐ ఇమ్రాన్ పాల్గొన్నారు.



అవుకు: నివాళులర్పిస్తున్న ఎంపీపీ చల్లా, అధికారులు



సంజామల: గిద్దలూరులో..

**గాంధీజీ చూపిన మార్గం ఎందరికో ఆదర్శం**

బేతంచెర్ల: మహాత్మాగాంధీ చూపిన అహింసా మార్గం ఎందరికో ఆదర్శం అని.. ఆయన్ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ప్రకాశ్‌బాబు, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంగన్న, ఎంపీపీ, నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ చలంరెడ్డి, కమిషనర్ హరిప్రసాద్ మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు శ్రీరాములు, చిన్న మద్దమ్మ, వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఏఈ గణేష్, ఈఓఆర్డీ వెంకట రంగనాయక్, ఏపీఓ శేషన్న, నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని శేషారెడ్డి పీహెచ్‌సీలో ఆర్యవైశ్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బొగ్గరపు ధనుంజయ, వైద్యురాలు సాగరిక గర్భిణులు, రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. రాజేంద్ర కుమార్, లక్ష్మీ నారాయణ, శ్రావణ్ కుమార్, సతీష్, సురేంద్ర, కిశోర్ పాల్గొన్నారు. మద్దిలేటి నరసింహ స్వామి ఆలయంలో ఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు.

సంజామల: మండల పరిధిలోని గిద్దలూరు పుస్తక నిక్షిప్త కేంద్రం నిర్వాహకుడు మద్దిలేటి ఆధ్వర్యంలో గాంధీ చిత్ర పటానికి నివాళులర్పించారు. పెండెకంటి చక్రపాని, మేడాసురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

అవుకు: మండల పరిషత్ కార్యాలయంలో గాంధీజీ విగ్రహం, లాల్‌బహదూర్ శాస్త్రీ చిత్రపటానికి ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి, ఈఓఆర్డీ రామక్రిష్ణవేణి, ఎంఈఓ శ్రీధర్ రావు, ఏఈలు రమణ, కరిముల్లా పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్య్రం కోసం ఆయన చేసిన పోరాటాలు మరువలేనివని కొనియాడారు. ప్రతి ఒక్కరూ గాంధీజీ అడుగుజాడల్లో నడుచుకోవాలని పేర్కొన్నారు.



డోన్‌లో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



కోవెలకుంట్ల: తహసీల్దార్ కార్యాలయంలో..



సన్మానం పొందిన పారిశుద్ధ్య కార్మికులు

**బాపూజీ అడుగుజాడల్లో నడుద్దాం**

ప్యాపిలి: జాతిపిత మహాత్మా గాంధీ అడుగుజాడల్లో నడుద్దామని ఈఓఆర్డీ బాలకృష్ణుడు అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం గాంధీ జయంతి నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఈఓఆర్డీ మాట్లాడుతూ బాపూజీ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి శివకుమార్ గౌడ్, ఏపీఎం కృష్ణమూర్తి పాల్గొన్నారు.



బనగానపల్లెలో పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం



పీఆర్‌టీయూ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



కొలిమిగుండ్ల: పుష్పాంజలి ఘటిస్తున్న రెవెన్యూ సిబ్బంది



కోవెలకుంట్ల: నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు



కోవెలకుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

## శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం

బనగానపల్లె: పట్టణంలో జరిగే శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానిస్తూ ఆర్యవైశ్య సంఘం నాయకులు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి బుధవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. బనగానపల్లెలోకి ఆయన నివాసంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గాథంశెట్టి వేనుగోపాల్, నాయకులు కలిశారు. ఆహ్వానపత్రిక అందజేసి శాలువ, పూలమాలతో సత్కరించారు. డాక్టర్ రవికుమార్, సంఘం కార్యదర్శి శ్రీరామసుబ్రమణ్యం, కార్యవర్గ సభ్యులు గుండా శ్రీనివాసులు, నూకల వెంకటసుబ్బయ్య, విజయుడు, చక్రపాణి శివయ్య, నాగరాజు, హనుమంతు ఉన్నారు.



కాటసానికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

## ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణం

అవుకు: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి అన్నారు. బదిలీ అయిన ఉద్యోగులతో బుధవారం ఎంపీపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలువురు అధికారులు, ఉద్యోగులు చాలా కాలం నుంచి అవుకులో పనిచేస్తూ మండల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. అవుకును వీడి వెళ్లటం బాధాకరమని..అయితే విధుల్లో భాగంగా వెళ్లక తప్పదన్నారు. ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి డోన్ మండలానికి, ఈఓఆర్డీ రామక్రిష్ణవేణి బండిఆత్మకూరుకు, పరిపాలనాధికారి వెంకటేశ్వర్లు కోసిగి, పీఆర్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు రమణ, కరిముల్లా బనగానపల్లెకు, ఏపీఈ అనీఫా బేతంచెర్లకు, ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ జమీలా ఆత్మకూరు బాలికల పాఠశాలకు బదిలీ అయినట్లు తెలిపారు. బదిలీపై వెళ్తున్న వారిని ఎంపీపీ సత్కరించారు.



ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి

## ప్రజల భాగస్వామ్యంతోనే 'స్వచ్ఛత' సాధ్యం

డోన్: ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం విజయవంతమవుతుందని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ అన్నారు. బుధవారం స్థానిక శ్మశాన వాటిక, డంపింగ్ యార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పట్టణంలో పచ్చదనం, పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఇందుకు ప్రజల సహకారం అవసరమన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీలు పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ సిబ్బంది రేయింబవళ్లు పనిచేస్తారన్నారు. డంపింగ్ యార్డులో అసంపూర్తిగా ఉన్న పనులను వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు.



డంపింగ్ యార్డులో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

## దేవీశరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

డోన్ టౌన్: దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. పట్టణంలోని పలు ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పాత బస్టాండ్‌లో మండపం ఏర్పాటు చేసి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. 9 రోజుల పాటు వివిధ రూపాల్లో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు. శ్రీగాయత్రి పీఠంలో నవరాత్రి పూజలకు ఆహ్వానం పలుకుతూ వేద గాయత్రి బ్రాహ్మణ సంఘం కమిటీ అధ్యక్షుడు శంకరశర్మ, ఉపాధ్యక్షుడు శేషావలి శర్మ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ఇంతియాజ్ బాషాలను కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు.



పాత బస్టాండ్‌లో విద్యుత్ దీపాల అలంకరణ

## ప్రభుత్వ భవనాల్లో ప్రైవేట్ వ్యక్తుల తిష్ట

- అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు
- ప్రజాధనం వృథా

డోన్: పట్టణ నడిబొడ్డున వందేళ్ల క్రితం నిర్మించిన రెవెన్యూ నాల్గవ తరగతి ఉద్యోగుల నివాస భవనాలు చాలా కాలం నుంచి నిరుపయోగంగా ఉన్నాయి. బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో ఈ భవనాల ఎదుట కోర్టు, తహసీల్దార్, సబ్‌ట్రెజరీ, రిజిస్ట్రార్ కార్యాలయాల భవనాలు కూడా నిర్మించారు. ఇవి నేటికీ చెక్కు చెదరకపోవడం విశేషం. అప్పటి ఉద్యోగులకు నివాస భవనాలుగా వినియోగించిన భవనాల్లో ప్రస్తుతం కొందరు ప్రైవేటు వ్యక్తులు తిష్ట వేశారు. ప్రభుత్వానికి ఎలాంటి అద్దె చెల్లించకుండానే శాశ్వత నివాసాలను ఏర్పరుచుకున్నారు. ఒకవైపు ప్రభుత్వ భవనాల్లో ప్రైవేటు వ్యక్తులు తిష్టవేసి ప్రభుత్వానికి నయాపైసా అద్దె చెల్లించకుండా స్థిర నివాసాలు ఏర్పాటుచేసుకోగా, మరోవైపు అద్దె భవనాల్లో పలు ప్రభుత్వ కార్యాలయాలను నిర్వహిస్తున్నారు. తూనికలు కొలతలు, కో–ఆపరేటివ్ సొసైటీ, ఆర్టీఏ కార్యాలయం, ఉద్యాన వనశాఖ, విజయ పాలడైరీ కార్యాలయాలకు ప్రతి నెలా లక్షలాది రూపాయలను ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు అప్పనంగా చెల్లిస్తోంది. దీంతో ప్రజాధనం వృథా అవుతోంది. ఈ పరిస్థితి మారాలంటే ప్రభుత్వ భవనాల్లో ఉండే ప్రైవేటు వ్యక్తులను ఖాళీ చేయించి ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించాలని, తద్వారా ప్రతి నెలా ప్రజాధనం ఆదా చేసినట్లు అవుతుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.





నిరుపయోగంగా ఉన్న నాల్గవ తరగతి ఉద్యోగుల క్వార్టర్స్, నిరుపయోగంగా రెవెన్యూ క్వార్టర్స్

### క్రైస్తవ గ్రంథాలయం ప్రారంభం

డోన్: క్రైస్తవులతో పాటు ఇతరులకు ఉపయోగపడే విధంగా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమని ఎల్ఐసీ రిటైర్డు ఏఓ శీలం ఏసుదాస్ అన్నారు. స్థానిక నెహ్రూనగర్‌లో క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. గ్రంథాలయానికి ఫర్నీచర్‌తో పాటు పుస్తకాలను విరాళంగా అందజేసిన ఆర్టీసీ ఉద్యోగి రత్నాలబాబును సభ్యులు సన్మానించారు. కమిటీ అధ్యక్షుడు ఆదాం, వైస్ ప్రెసిడెంట్ ప్రవీన్‌కుమార్, జనరల్ సెక్రటరీ జాన్సన్ బాబు, కోశాధికారి జర్మియా, సభ్యులు పాల్గొన్నారు.

## మద్యం అక్రమ విక్రయాలపై నిఘా

డోన్ రూరల్: నాటుసారా తయారీ, అక్రమంగా మద్యం విక్రయించేవారిపై నిఘా ఉంచాలని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాముడు అన్నారు. బుధవారం పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు.స్టేషన్‌లోని రికార్డులు, కేసుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డోన్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాల ఎంపిక ప్రక్రియ జరుగుతోందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 9వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 11వ తేదీ డ్రా తీసి దుకాణాలకు లైసెన్సులు కేటాయిస్తామన్నారు. వివరాలకు 9440902584 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఆయన వెంట ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి, ఎస్ఐ సోమశేఖర్‌రావు ఉన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఏఈఎస్ రాముడు



### కంపచెట్ల తొలగింపు

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జి వద్ద పేరుకు పోయిన కంపచెట్లను సర్పంచ్ శివరాముడు ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి జేసీబీతో తొలగిస్తున్నారు. వాగు నిండా కంపచెట్లు, చెత్తా చెదారంతో పూర్తిగా నిండిపోయింది. మరో వైపు మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. స్థానికులు చెత్తను తీసుకొచ్చి వాగులో పడేస్తుండడంతో ఈ పరిస్థితి తలెత్తింది. శ్మశాన వాటికకు చేరుకునేందుకు బ్రిడ్జి కింద నుంచి వెళ్లాలంటే స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండేవారు. జేసీబీతో కంపచెట్లను పూర్తిగా తొలగించి మరుగునీరు లేకుండా చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. వాగు మధ్యలో గతంలో చెక్‌డ్యాం నిర్మించడంతో నీరు నిల్వ ఉంటున్నాయని వాటిని తొలగిస్తున్నట్లు చెప్పారు. ఇళ్లలోని చెత్తను బ్రిడ్జి వద్ద వేయరాదని సర్పంచ్ గ్రామస్తులకు సూచించారు.



జేసీబీతో శుభ్రం చేస్తున్న దృశ్యం